క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శిగా మందారెడ్డి



ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన సత్తి మందారెడ్డిని రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. 12వ వార్డు ఆరిలోవ ప్రాంతానికి చెందిన మందారెడ్డి పార్టీ ఏర్పాటైనప్పటి నుంచి పని చేస్తున్నారు. ఆయన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లా వైల్డ్‌లైఫ్ వార్డెన్‌గా పనిచేశారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న తనను అధిష్టానం గుర్తించి మరింత బాధ్యత పెంచిందని ఈ సందర్భంగా మందారెడ్డి తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు విధేయుడిగా ఉంటానన్నారు. ఈ పదవిలో నియమించడానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావులకు మందారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సీతంపేటలో మహాన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సంపంగి శ్రీనివాసరావు, భోగవిల్లి గోవింద్

సీతంపేట: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా సీతంపేటలో రాధాకృష్ణ రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం పాలక మండలి పూర్వ సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భోగవిల్లి గోవింద్, స్థానిక నాయకుడు భీమవరపు శ్రీనివాసరావు, ఇప్పిలి అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. సుమారు 4 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భవానీ మాలధారులు పాల్గొన్నారు.

9 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

తగరపువలస: విశాఖ జిల్లా జాలారిపల్లిపాలెం గంగవరం కబడ్డీ గ్రౌండ్‌లో ఈ నెల 9 నుంచి 11 వరకు రాష్ట్ర స్థాయి పురుషుల ఆహ్వాన కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి జె.వి.ఎస్.ప్రసాదరెడ్డి తెలిపారు. శనివారం ఆయన చిట్టివలసలో మాట్లాడుతూ జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ 19వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి అనుమతితో విశాఖ జిల్లా కబడ్డీ సంఘం పర్యవేక్షణలో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 9 వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రబ్బర్ మ్యాట్లపై నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లా పురుషుల కబడ్డీ జట్లు పాల్గొంటాయన్నారు. ఈ పోటీలలో విజయం సాధించే నాలుగు జట్లుకు జీవీఎంసీ 64వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీను, ఇతర దాతల సాయంతో జె.పి.ఎం.స్పోర్ట్స్ క్లబ్ నగదు బహుమతులు ప్రకటించిందన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.35 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు, నాలుగో బహుమతి కింద రూ.15 వేలు ఇవ్వనున్నట్టు ప్రసాదరెడ్డి ప్రకటించారు.

జీఎస్టీ ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన



జీఎస్టీ ప్రయోజనాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతంపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీఎస్టీ అంటే ఏంటి?, దాని వల్ల దేశానికి, రాష్ట్రానికి కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై విద్యార్థులు తయారు చేసిన ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, రమణి, శ్యామల, ప్రభాకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎన్.వి.విశ్వనాథం, వై.రామలక్ష్మి, కిరణ్‌కుమార్, గ్లోరీ, అప్పారావు, జ్యోతి, రత్నం పాల్గొన్నారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా

జిల్లా పశు సంవర్ధక శాఖకు చెందిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇప్పటికే వందల ఎకరాల స్థలం పదుల సంఖ్యకు చేరింది. ఉన్న స్థలాలను రక్షించుకోవడంలో శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆక్రమణదారులకు కొమ్ముకాస్తూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలను మూటకట్టుకుంటున్నారు. రక్షణ కల్పిస్తామంటూ అధికారులు మాటలతోనే తాత్సారం చేస్తుండటంతో రూ.కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. **– ఆరిలోవ**

- పశు సంవర్ధక శాఖ స్థలాలపై కబ్జాదారుల కన్ను
- కొన్ని చోట్ల యథేచ్ఛగా ఆక్రమణలు
- భూముల సంరక్షణను గాలికొదిలేసిన అధికారులు



పెదగదిలి గెడ్డ పక్కన ఆక్రమణకు గురైన పశు సంవర్ధక శాఖకు చెందిన స్థలం

జాతీయ రహదారికి ఇరువైపులా అటు విశాలాక్షినగర్.. ఇటు పాత డెయిరీఫారం నుంచి ఆరిలోవ వరకు పశు సంవర్ధక శాఖకు చెందిన ఖాళీ స్థలాలున్నాయి. గతంలో ఇక్కడ సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో భూములుండేవి. వాటిలో పశు గ్రాసం పండించి సంరక్షించేవారు. ఈ భూముల్లో హెల్త్‌సిటీ, విమ్స్, విశాలాక్షినగర్(వెటర్నరీ లేఅవుట్‌ను ఆనుకొని) వెటర్నరీ వైద్యులకు ఇళ్ల స్థలాల కోసం సుమారు 230 ఎకరాల వరకు ప్రభుత్వం తీసుకుంది. మిగిలిన కొన్ని వందల రూ.కోట్ల విలువ చేసే భూముల రక్షణను ఆ శాఖ అధికారులు గాలికొదిలేశారు. పాత డెయిరీఫారం పరిసరాల్లో సుమారు 70 నుంచి 80 ఎకరాల వరకు మిగిలి ఉన్న భూమిని సంరక్షించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇంతవరకు వాటికి రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా చోట్ల గల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి.

రక్షణ లేని స్థలాలు..

పశు సంవర్ధక శాఖకు చెందిన ఖాళీ స్థలాలకు అధికారులు ఎటువంటి రక్షణ కల్పించకుండా వదిలేశారు. స్థలాలు ఖాళీగా ఉండటంతో కొందరు స్థానికులు వాటిని దర్జాగా ఆక్రమిస్తున్నారు. దీనిపై ఎవరైనా స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తే అప్పటికప్పుడు హడావుడి చేసి రక్షణ గోడలు నిర్మిస్తాం, మా స్థలాలు రక్షించుకుంటామంటూ అధికారులు ప్రకటించి వదిలేస్తున్నారు. అనంతరం వాటి జోలికి వెళ్లడంలేదు. దీంతో కబ్జాదారులు వారి పని వారు చేసుకుపోతున్నారు. దీంతో వందల రూ.కోట్ల భూములు ఆక్రమణదారుల చేతుల్లోకి చేరుతున్నాయి.

పెదగదిలి గెడ్డ అంచున నిర్మాణాలు

పెదగదిలి గెడ్డ అంచు నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా తోటగరువును ఆనుకుని బీఎస్‌ఆర్ నగర్, బీటీఆర్ నగర్, సూర్యతేజానగర్ మధ్యలో సుమారు 20 ఎకరాలకు పైగా పశు సంవర్ధక శాఖకు చెందిన స్థలం ఉంది. దాని చుట్టూ రక్షణ గోడ లేదు. దీంతో పలుచోట్ల ఆక్రమణకు గురవుతోంది. ఇందులో ఎర్నిదుర్గమాంబ ఆలయం పక్కన స్థలం ఆక్రమణకు గురైంది. కొందరు పెద్దలు ఈ స్థలాన్ని ఆక్రమించి ఇప్పటికే కల్యాణ మండపం నిర్మించారు. అంతటితో ఆగకుండా శివాలయ నిర్మాణం కోసం ఇక్కడి గెడ్డను ఆనుకొని సుమారు అరెకరం స్థలాన్ని చదును చేసేశారు. దీనిలో తాత్కాలికంగా కమ్మలతో ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం జరిగి ఏడాది గడిచినా.. ఆ శాఖ అధికారులు పూర్తిస్థాయి చర్యలు చేపట్టలేదు. రెండు సార్లు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోడానికి వెళ్లిన అధికారులను ఆక్రమణదారులు, వారి అనుచరులు అడ్డుకోవడంతో వారు వెనుదిరిగి మాకెందుకులే అన్నట్లు వదిలేశారు.



బీటీఆర్ నగర్‌లో ఆక్రమణకు గురైన స్థలం

బీటీఆర్ నగర్‌లో ఆక్రమణ

బీటీఆర్ నగర్‌లో సుమారు 200 చదరపు గజాల స్థలాన్ని నాలుగు నెలల కిందట కొందరు ఆక్రమించారు. దానిలోని తాటిచెట్లను సైతం తొలగించి నిర్మాణం కోసం సిద్ధమయ్యారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు తప్పనిసరి పరిస్థితిలో ఆక్రమణ తొలగించి స్థలం స్వాధీనం చేసుకున్నారు. దాని చుట్టూ ఎలాంటి కంచె ఏర్పాటు చేయకుండా ఖాళీగా వదిలేశారు. దీంతో కొందరు స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి మళ్లీ ఆ స్థలం కబ్జాకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

విశాలాక్షినగర్‌లో స్థల వివాదం



విశాలాక్షినగర్‌లో వివాదంగా మారిన స్థలం

జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో కొత్తగా ఏర్పాటైన వెటర్నరీ కాలనీలో జాతీయ రహదారికి సమీపంలోని స్థలం వ్యవహారం వివాదంగా మారింది. ఇక్కడ సర్వే నంబర్ 133/8 పశు సంవర్ధక శాఖకు చెందిన సుమారు 30 ఎకరాలకు పైగా స్థలం ఉండేది. దానిలో 18.78 ఎకరాలను పశు సంవర్ధక శాఖ వైద్యుల నివాసాలకు ప్రభుత్వం కొన్నేళ్ల కిందట కేటాయించింది. మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. దాని చుట్టూ ఎలాంటి రక్షణ గోడ గాని, ఫెన్సింగ్ గానీ అధికారులు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ఆ ఖాళీ స్థలం తమదేనంటూ ఐదు నెలల కిందట కొందరు వ్యక్తులు వచ్చి స్వాధీనం చేసుకోదలిచారు. దీనిపై పశు సంవర్ధక శాఖ అధికారులు ఆరిలోవ పోలీసులను, రెవెన్యూ అధికారులను సైతం ఆశ్రయించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆ స్థలం వివాదాస్పదంలోనే మిగిలింది.

తోటగరువులో అరెకరాల ఖాళీ స్థలం



తోటగరువు వెటర్నరీ ఆస్పత్రి వెనుక రక్షణ గోడ లేని పశు సంవర్ధక శాఖ స్థలం

తోటగరువు వద్ద స్థానిక వెటర్నరీ ఆస్పత్రి వెనుక బీఎస్‌ఆర్ నగర్‌ను ఆనుకొని పశు సంవర్ధక శాఖకు చెందిన సుమారు అరెకరాల వరకు ఖాళీ స్థలానికి అధికారులు రక్షణ గోడ గాని, కంచె గాని నిర్మించకుండా వదిలేశారు. దీంతో ఇది స్థానికులు కార్లు, ఇతర వాహనాలు నిలుపుకునే పార్కింగ్ స్థలంగా మారిపోయింది. అంతటితో ఆగకుండా ఆ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నంలో కబ్జాదారులు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమచారం. దీని గురించి ఆ శాఖ అధికారులను కొందరు కబ్జాదారులు ప్రసన్నం చేసుకుంటున్నట్లు తెలిసింది.

కుంగిన మట్టి వంతెన



కంబాలకొండ పార్కులో కిందకు కుంగిన మట్టి వంతెన

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో నిర్మించిన మట్టి వంతెన ఇటీవల కురిసిన వర్షాలకు కిందకు కుంగిపోయింది. భారీ వర్షాలు కురిస్తే మరింత కుంగిపోయే పరిస్థితి నెలకొంది. ఇటీవల నగర వనం నిధులు రూ.కోట్లతో అటవీ శాఖ అధికారులు ఇక్కడ పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో ఒక్కొక్కటిగా నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పనుల్లో భాగంగా కంబాలకొండ పార్కు లోపల గేటు నుంచి పక్కనున్న నర్సరీలోకి వెళ్లడానికి వీలుగా మధ్యలో గెడ్డపై మట్టితో వంతెన నిర్మించారు. దానికి రూ.లక్షల్లోనే ఖర్చు చూపించినట్లు సమాచారం. అవసరం లేని ఈ వంతెనను నాణ్యత లోపంతో నిర్మిస్తున్నట్లు ప్రారంభంలోనే ఆరోపణలు వచ్చాయి. ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహించడంతో కింది స్థాయి అధికారులు ఈ వంతెన నిర్మాణం పూర్తి చేశారు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే సుమారు అరడుగు లోతులో వంతెన కిందకు దిగిపోయింది. దీంతో వంతెన నిర్మాణం నాణ్యతలో డొల్లతనం బయటపడిందని పార్కుకు వెళ్తున్న సందర్శకులు విమర్శిస్తున్నారు.

సిరులతల్లికి తులసి పూజ



డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకెళ్ల రమణమూర్తి మరణం తీరని లోటు



వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆకెళ్ల రమణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మొల్లి అప్పారావు, పార్టీ నాయకులు

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆకెళ్ల రమణమూర్తి మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. సీతమ్మధార రాధాకృష్ణ కల్యాణ మండపంలోని తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో శనివారం రమణమూర్తి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మొల్లి అప్పారావు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రమణమూర్తితో పరిచయం, 30 ఏళ్ల ప్రయాణం మరువలేనిదన్నారు. రాజకీయంగా పార్టీకి చూపిన విధేయత, క్రమశిక్షణ గొప్పవని కొనియాడారు. మంచి మనసున్న రమణమూర్తిని కోల్పోవడం బాధాకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్నేహితులు, పార్టీ నాయకులు రమణమూర్తి సేవలను కొనియడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ విభాగం అధికార ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు బోండా ఉమామహేశ్వరరావు, 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, వేమన సంఘం అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, హోటల్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, 23వ వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణరెడ్డి, తూర్పు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కె.శిరీష, ఎడ్యుకేషన్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, వైద నారాయణరావు, సంపంగి సురేష్, లవన్ కుమార్, పిలక మధుసూదనరెడ్డి, సత్యవతి, జ్యోతి, సంధ్య, పార్వతి, శశికళ, ధనలక్ష్మి, పతివాడ కనకరాజు, సత్తి మందారెడ్డి, సత్యాల వెంకట్, చొల్లంగి నాగేశ్వరరావు, నీలారెడ్డి, సురేష్, మధుపాడ రవి, బూస రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగాల్లో నైపుణ్యాల ప్రోత్సాహం

సీతంపేట: స్థానిక బుల్లయ్య కళాశాలలో శనివారం గ్లోబల్ హ్యాకథాన్ నాసా ఇంటర్నేషనల్ యాప్స్ చాలెంజ్–2025ను నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథి ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను, పరిశోధకులను ప్రేరేపిస్తూ సమాజ సమస్యలను పరిష్కరించడానికి సృజనాత్మక ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. లెర్న్, లాంచ్, లీడ్ అంశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం నాసా ఓపెన్ సోర్స్ డేటాను ఉపయోగించి అంతరిక్ష శాస్త్రం, సాంకేతిక రంగాల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, సమస్యల పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి, జి.ఎస్.కె.చక్రవర్తి పాల్గొన్నారు.

విదేశీ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



విదేశీ విద్యార్థుల ఓరియంటేషన్‌లో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ రాంబాబు

మద్దిలపాలెం: విదేశీ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్, అంతర్జాతీయ వ్యవహారాల(ఇన్‌చార్జి) డీన్ ప్రొఫెసర్ కె.రాంబాబు ఆకాంక్షించారు. ఏయూలో వివిధ దేశాల నుంచి ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్) ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు శనివారం ఇంజినీరింగ్ కళాశాల గౌతమబుద్ధ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయం సాంకేతిక వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో అడుగేయాలని విదేశీ విద్యార్థులకు సూచించారు. ఐసీసీఆర్ బెంగళూరు జోనల్ డైరెక్టర్ పరదీప్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం అనేక దేశాలతో తమ స్నేహాన్ని కొనసాగిస్తూ నాణ్యమైన విద్యను ఆయా దేశాల యువతకు అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని సూచించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన నియమావళి, వివరాలను తెలియజేశారు. ఏయూ అంతర్జాతీయ విద్యార్థి వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.ఎం.యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలని, వారి భావాలు, ఆలోచనలను స్వాగతించడం అలవాటు చేసుకోవాలన్నారు. ఏయూ పరంగా కళాశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు అవసరమైన సహకారాన్ని ఎల్ల వేళలా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీసీఆర్ తరఫున కొత్తగా ప్రవేశం పొందిన సుమారు 300 మంది అంతర్జాతీయ విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

బీచ్‌రోడ్డు: విశాఖ పోర్టులోని జేపీ ఆఫ్‌షోర్‌లో పని చేస్తున్న కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.ఎం. కుమార మంగళం మాట్లాడుతూ నెలకు రూ. 17,524 వేతనం అయితే రూ. 14,500 ఇస్తున్నారని, 12 గంటలు పని చేయిస్తున్నారని తెలిపారు. అలాగే సెలవులు ఇవ్వడం లేదని, పీఎఫ్ అమలు చేయడం లేదని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే కార్మికులను ఆపేయడం చట్ట వ్యతిరేకమన్నారు. జేపీ యాజమాన్యం ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా కార్మికులను ఆపేసిందన్నారు. రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, ముఖ్యంగా పండగ ముందు రోజు కార్మికులను విధులకు హాజరు కాకుండా ఆపేసిందన్నారు. ఈ యాజమాన్యంపై కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి. జగన్, నాయకులు శ్రీను, తాతలు, అచ్యుత్, తరుణ్, కొర్లయ్య, ముత్రాజు తదితరులు పాల్గొన్నారు

జూ కిటకిట



సీతాకోకచిలుకల పార్కు వద్ద సందర్శకులు

ఇందిరాగాంధీ జూ పార్కు శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. కుటుంబాలతో సహా జూ పార్కును సందర్శించి.. ఇక్కడి వన్యప్రాణులను తిలకించారు. తెల్ల పులులు, పెద్ద పులులు, నీటి ఏనుగులు, కోతులు, ఏనుగులు, పక్షులు, పాములు, జింకలు, జిరాఫీలు తదితర జంతువులు వాటి ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ సందర్శకులను కనువిందు చేశాయి. వివిధ రకాల పక్షులు కిలకిలరావాలతో అలరించాయి. జూలో ఆధునికీకరించిన లవ్ బర్డ్స్ జోన్, దాని ఆనుకుని కొత్తగా నిర్మించిన డక్ యావరీ సందర్శకులను ఆకట్టుకున్నాయి. **- ఆరిలోవ**



నీటి ఏనుగును ఫొటోలు తీస్తున్న సందర్శకులు



జూలో పెద్ద పులుల ఎన్‌క్లోజర్ వద్ద సంద్శకుల సందడి

ఎండాడలోనే భవన నిర్మాణం చేపట్టాలి

- జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అప్పలనారాయణ



మాట్లాడుతున్న అల్సి అప్పలనారాయణ

డాబాగార్డెన్స్: యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండాడలో కేటాయించిన స్థలంలోనే యాదవ సంఘం భవన నిర్మాణం చేపట్టాలని జాతీయ యాదవ ఐక్యవేదిక అధ్యక్షుడు అల్సి అప్పలనారాయణ కోరారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు దాసు మోహనరావు, అల్లు రమణతో కలిసి మాట్లాడారు. యాదవ సామాజిక వర్గానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంఘ భవనానికి జీవో జారీ చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ జీవోని రద్దు చేసి స్థలం మార్పునకు ప్రయత్నిస్తుందన్నారు. దీని వల్ల యాదవ సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే కూటమి ప్రభుత్వం తన ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. యాదవులు అభివృద్ధి చెందాలంటే సంఘ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్, యాదవ సంఘం మహిళా నాయకురాలు అనుపమ, దొక్కర అప్పారావు, జోగ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెలోడీ క్రియేటర్స్ రజతోత్సవం



రజతోత్సవంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

డాబాగార్డెన్స్: మెలోడి క్రియేటర్స్ రజతోత్సవం (25వ వార్షికోత్సవం) శనివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వ విద్యాలయం గౌరవ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎస్ రాజు, కనకమహాలక్ష్మి దేవాలయం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ), వీవీ రమణమూర్తి, ప్రముఖ సంఘ సేవకుడు, ప్రేమసమాజం అధ్యక్షుడు మట్టపల్లి హనుమంతరావు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన 'మెలోడీ సాంస్కృతిక వైభవం'రజతోత్సవ సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ సంస్కృతికి, సంగీతానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నో సంగీత కార్యక్రమాలు నిర్వహించి ఎందరో వర్ధమాన కళాకారులను ప్రోత్సహిస్తున్న సంస్థ నిర్వాహకులు సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, కడలిని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, కన్వీనర్ కడలి వీరాస్వామి, వి.ప్రభాకర్, ఎంఎస్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.